APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 21 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :86 పేజీలు : 04 వెల: 2-00/-



## సీదిరి అప్పలరాజుకు జగన్ భరోసా

**అక్రమ కేసులతో వేధింపులపై ఆరా**

**కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన జగన్**

**పార్టీ అండగా ఉంటుందని స్పష్టం**

తాడేపల్లి, ఆగస్టు 20 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర



కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పరిణామాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. అక్రమ కేసులో అరెస్టై 23 రోజుల పాటు శ్రీకాకుళం జైలులో ఉన్న డాక్టర్ సీదిరి అప్పలరాజుతో జగన్ ప్రత్యేకంగా మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో ఉన్న సమయంలో ఎదురైన పరిస్థితులు, అనంతర పరిణామాల గురించి ఆరా తీశారు. రాజకీయంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని అప్పలరాజుకు జగన్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా ప్రజల మధ్య ఉండాలని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అప్పలరాజుకు జగన్ భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు కుటుంబ సభ్యులతో కూడా జగన్ మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. పార్టీ నాయకత్వం తమకు అండగా ఉందన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# దక్షిణ మండలి సమావేశానికి చంద్రబాబు హాజరు

- మహాబలిపురంలో కీలక భేటీ ప్రారంభం
- అమిత్ షా నేతృత్వంలో సమావేశం
- దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ
- అభివృద్ధి, కేటాయింపులపై దృష్టి



మహాబలిపురం, ఆగస్టు 20 : కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహిస్తున్న 31వ దక్షిణ మండలి సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజ-రయ్యారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పుదుచ్చేరి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, కేంద్ర-రాష్ట్ర సంబంధాల బలోపేతం వంటి అంశాలు ప్రధాన చర్చాంశాలుగా నిలవనున్నాయి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రవాణా అనుసంధానం, అంతర్రాష్ట్ర జల వనరుల వినియోగం, భద్రతా అంశాలు, పరిపాలనా సమన్వయం వంటి విషయాలపై విస్తృత చర్చ జరగనుంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి లభించాల్సిన నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పురోగతి వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రాధాన్యత పొందనున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించే అవకాశముందని సమాచారం. ముఖ్యంగా రాష్ట్ర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రోత్సాహం, కేంద్ర సహకారం అవసరమైన కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దక్షిణ మండలి సమావేశాలు రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించడంతో పాటు ప్రాంతీయ



సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు కీలక వేదికగా నిలుస్తున్నాయి. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి, పరిపాలనా సమన్వయానికి దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గల్లంతైన

## మత్స్యకారుడి కోసం గాలింపు

**అప్పన్న ఆచూకీకి ముమ్మర చర్యలు**

**హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు**

**అధికారులతో పరిస్థితి సమీక్ష**

**బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ**

అమరావతి, ఆగస్టు 20 : సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డు శాఖలు సమన్వయంతో విస్తృత స్థాయిలో గాలింపు చేపట్టాలని సూచించారు. ఈ నెల 16న ఎనిమిది మంది మత్స్యకారులు వేటకు వెళ్లిన సమయంలో సముద్ర తీరానికి సుమారు 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదానికి గురైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రమాదంలో మత్స్యకారుడు అప్పన్న గల్లంతయ్యాడని తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను మంత్రి అధికారుల నుంచి తెలుసుకున్నారు. ప్రమాద సమయంలో బోటులో ఉన్న మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపై కూడా వంగలపూడి అనిత ఆరా తీశా-రు. వారికి అవసరమైన సహాయం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని మంత్రి సూచించారు. సముద్ర ప్రాంతాల్లో గాలింపు చర్యలను నిరంతరాయంగా



కొనసాగించి ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సంబంధిత శాఖలకు సూచించారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిసా-యిలో అండగా ఉంటుందని హోంమంత్రి హామీ ఇచ్చారు. గాలింపు చర్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, అప్పన్న ఆచూకీ లభించే వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.

## జగన్‌ను కలిసిన చింతాడ రవికుమార్



తాడేపల్లి, ఆగస్టు 20 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గ వైఎ-స్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఇటీవల తనపై నమోదైన కేసు, అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో రవికుమార్ జగన్‌ను కలిసి పరిస్థితులను వివరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా జగన్ ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. అక్రమ కేసులో అరెస్టై అనంతరం బెయిల్‌పై విడుదలైన చింతాడ రవికుమార్ ఎదుర్కొన్న పరిస్థితుల గురించి జగన్ వివరాలు తెలుసుకున్నారు. కేసుకు సంబంధించిన అంశాలను పూర్తిగా విన్న ఆయన, రాజకీయ జీవితంలో ఇలాంటి సవాళ్లు సహజమని పేర్కొన్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించినట్లు పార్టీ నేతలు తెలిపారు. రాజకీయంగా ఎదురయ్యే ఒత్తిళ్లు, ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కోవాలని జగన్ సూచించారు. ప్రజల మధ్య పనిచేసే నాయకులకు ఇలాంటి పరిస్థితులు కొత్తవి కావని, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణుల మద్దతుతో ముందుకు సాగాలని ఆయన చెప్పినట్లు వెల్లడైంది. పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే నాయకులు ఎలాంటి బెదిరింపులకు లొంగవద్దని సూచించినట్లు సమాచారం. చింతాడ రవికుమార్‌కు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని జగన్ స్పష్టం చేశారు. అవసరమైన చోట న్యాయపరమైన సహాయం నుంచి రాజకీయ సహకారం వరకు పూర్తి మద్దతు అందిస్తామని భరోసా ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నాయకులు, కార్యకర్తలపై వచ్చే సవాళ్లను పార్టీ సమష్టిగా ఎదుర్కొంటుందని ఆయన తెలిపారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని జగన్ సూచించినట్లు తెలిసింది. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పార్టీ కార్యక్రమాలను గ్రామ-స్థాయికి తీసుకెళ్లాలని రవికుమార్‌కు సూచనలు చేసినట్లు సమాచారం. కార్యకర్తలతో సమన్వయం పెంచుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సమావేశం అనంతరం చింతాడ రవికుమార్ పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అండగా నిలుస్తామని ఇచ్చిన భరోసా మరింత ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా పార్టీ నాయకత్వం తమకు అండగా ఉంటోందనే విశ్వాసంతో మరింత ఉత్సాహంగా పనిచేస్తాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

## కేసీఆర్ కోసం 300 కిలోమీటర్ల పాదయాత్ర

ఎర్రవెల్లి, ఆగస్టు 20 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నుంచి ఇద్దరు సామాన్య అభిమానులు సుమారు 300 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి గురువారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. తమ అభిమానాన్ని, అంకితభావాన్ని చాటుకుంటూ చేసిన ఈ యాత్ర స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వాంకిడి మండలానికి చెందిన జాడే తిరుపతి అనే ఆటో డ్రైవర్, దుర్గం శంకర్ అనే హోటల్ కార్మికుడు ఈ పాదయాత్రను చేపట్టారు. కేసీఆర్ పట్ల ఉన్న



అభిమానంతోనే ఈ యాత్ర ప్రారంభించామని, తమకు ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేదా వినతులు లేవని వారు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతోనే ఈ ప్రయాణం చేశామని పేర్కొన్నారు. దాదాపు 11 రోజుల పాటు రోజుకు సగటున 25 కిలోమీటర్ల చొప్పున కాలినడకన ప్రయాణించి వారు ఎర్రవెల్లికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా తమ లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో వారికి కేసీఆర్‌ను కలిసే అవకాశం లభించినట్లు సమాచారం. ఎర్రవెల్లిలోని నివాసానికి చేరుకున్న అభిమానులను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ఇంత దూరం నడిచి వచ్చినందుకు అభినందించారు. ఎలాంటి స్వార్థం లేకుండా అభిమానంతో చేసిన ఈ పాదయాత్ర తమను కదిలించిందని, వారి అంకితభావాన్ని ప్రశంసించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

# జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సముద్రాల గాయత్రి

కొత్తగూడెం,ఆగస్టు 20,( అనంత సూర్య ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ అనుబంధ జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీని జిల్లా పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డిప్రకటించారు.కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 26 మందితో కూడిన జిల్లా మహిళా మోర్చా కమిటీని నియమించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సముద్రాల గాయత్రిని నియమించారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా కేతిని సావిత్రి, బానోత్ గంగ, అట్రం మమత,గరిక లక్ష్మి; ప్రధాన కార్యదర్శులుగా జల్ల స్వప్న,మువ్వ అపర్ణ; కార్యదర్శులుగా ధారావత్ పార్వతి, అడప వెంకటమణి, బట్టు సంధ్య, ఉయిక తులసిలను నియమించారు. కోశాధికారిగా భీమల్ సునీత,కార్యాలయ కార్యదర్శులుగా భుక్యా ఆశ,కొల్లె



అనిత,సామాజిక మాధ్యమాల సమన్వయకర్తగా పల్లపు శిరీష, మన్ కీ బాత్ కన్వీనర్‌గా బండారి రాజేశ్వరి,ఐటీ కన్వీనర్‌గా పోలే మనస్విని,అధికార ప్రతినిధిగా భోగ లక్ష్మిని ఎంపిక చేశారు.కార్యవర్గ సభ్యులుగా తాండ్ర కుసుమ భవాని, ఏసు మణి,ధారావత్ భారతి, ధారావత్ విష్ణుప్రియ,పుట్ట వెంకటరమణ,పర్సగాని నాగమణి, పర్సగాని శ్రావణి,రావుల పద్మ, పుట్టి సుజాతలను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తిని మరింత బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆమె ప్రస్తావించారు.రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు,వివక్షకు వ్యతిరేకంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని గాయత్రి తెలిపారు.

# భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి

చేవెళ్ల, ఆగస్టు 20, (అనంత సూర్య ప్రతినిధి): హిమాయత్ నగర్ చౌరస్తా దగ్గర ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి బొల్లిగిద్ద సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ టిపిసిసి స్పోక్ పర్సన్ గౌరీ సతీష్ మున్సిపల్ అధ్యక్షుడు విక్రం రెడ్డి మాజీ అధ్యక్షులు తమ్మలి మానేయ మండల ఉపాధ్యక్షులు మరీ రవీందర్ రెడ్డి ,మండల కిసాన్ సెల్ అధ్యక్షలు బొక్క వెంకటరెడ్డి పూల మాలలు వేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు భానూరి శివ శంకర్ గౌడ్, చేవెళ్లనియోజకవర్గం కాంగ్రెస్ పార్టి లేబర్ సెల్ (ఐ ఎన్ టి యు సి) ప్రధాన కార్యదర్శి మాట్లాడుతు. మాజీ ప్రధానమంత్రి, భారతరత్న' స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి (సద్భావనా దివస్) ఘన నివాళిభారతదేశాన్ని 21వ శతాబ్దపు డిజిటల్ యుగంలోకి నడిపించిన దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి (ఆగస్టు 20) సందర్భంగా ఆయన పవిత్ర స్మృతికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నాము. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రతి



సంవత్సరం ఈ రోజును సద్భావనా దివస్ (మత సామరస్యదినోత్సవం)గాజరుపుకుంటారు.ముఖ్యమైన ఘట్టాలు ం దేశ పురోగతిలో రాజీవ్ గాంధీ పాత్ర సాంకేతిక, టెలికాం విప్లవం భారతదేశంలో కంప్యూటర్, ఐటీ మరియు టెలికమ్యూనికేషన్స్ రంగానికి పునాది వేసి,దేశాన్ని సమాచార విప్లవం వైపు నడిపించిన పితామహుడు రాజీవ్ గాంధీ. యువతకు ఓటు హక్కు: 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు కనీస వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి, దేశరాజకీయాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచిన ఘనత ఆయనదే పిన్న వయస్కుడైన ప్రధాని కేవలం 40 సంవత్సరాల వయస్సులోనే భారత 6వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, అతి పిన్న వయస్సులో ప్రధాని అయిన నాయకుడిగా చరిత్ర సృష్టించారు.పంచాయతీ రాజ్ ం గ్రామీణాభివృద్ధి: 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలు మరియు పంచాయతీ రాజ్ వ్యవస్థలకు రాజ్యాంగ బద్ధత కల్పించి, గ్రామాలకు అధికారాలను వికేంద్రీకరించారు.నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడానికి జవహర్ నవోదయ విద్యాలయాలను (జీఎవి) ఏర్పాటు చేశారు. ఈ సద్భావనా దివస్ సందర్భంగా,రాజీవ్ గాంధీ ఆశయాలైన జాతీయ సమైక్యత,మత సామరస్యం మరియు దేశ ప్రగతి కోసం ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని కోరరు మండల కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ మీనాజుద్దీన్ కౌన్సిలర్ అశోక్ యాదవ్ జిల్లా జనరల్ సెక్రెటరీ అనంతరెడ్డి మాజీ ఎంపిటిసి రామ్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దారేది కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు గన్నెపాగ నర్సింగ్ రావు మాజీ సర్పంచ్ రాములు కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్ గౌడ్ జయరాం రెడ్డి బిక్షపతి ముదిరాజు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి విజయవంతం చేసినారు

# రాజీవ్ ఆశయాలే కాంగ్రెస్ లక్ష్యం తోట దేవీప్రసన్న



కొత్తగూడెం,ఆగస్టు 20,( అనంత సూర్య ప్రతినిధి) : భారతరత్న,మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని తెలిపారు.18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే రాజీవ్ గాంధీకి అర్పించే ఘన నివాళి అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్‌రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎం.పెద్దబాబు,పైడా రాజేంద్రప్రసాద్,లోశెట్టి నాగార్జున, జిల్లా కార్యదర్శి ఆంతోటి పాల్,మురళి నాయక్,కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు అచ్చ నాగరాజు, బొబ్బల వెంకట్,రాము,చావల పురుషోత్తం,ఆకుల సుధాకర్,యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్,ప్రణయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యపై ప్రభుత్వ విధానం మార్చాలి




కొత్తగూడెం,ఆగస్టు 20,(అనంత సూర్య ప్రతినిధి): : తెలంగాణ, రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 97, శక్తి స్కీమ్‌ను తీసుకొచ్చిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ ఆరోపించారు.ఈ స్కీమ్‌ను తక్షణమే రద్దు చేసి,పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యా బోర్డు (ఎస్‌బీటీఈటీ) పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంద నాగకృష్ణ మాట్లాడుతూ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ విద్యార్థులను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. సాంకేతిక విద్యను పర్యవేక్షించే ఎస్‌బీటీఈటీని కొనసాగించకుండా శక్తి స్కీమ్‌ను తీసుకురావడం ప్రభుత్వ విద్యను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నంగా కనిపిస్తోందని అన్నారు. ఇంతకు ముందు పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ ద్వారా లాటరల్ ఎంట్రీ విధానంలో బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉండేదని తెలిపారు. శక్తి స్కీమ్ అమలుతో విద్యార్థులకు ఉన్నత విద్యలో కొనసాగే అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు,సరిపడా అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపే విధానాలను తీసుకురావడం సరికాదన్నారు.శక్తి స్కీమ్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో బంద్ నిర్వహించామని,విద్యార్థులు స్వయంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీఓ నంబర్ 97, శక్తి స్కీమ్‌ను రద్దు చేసి ఎస్‌బీటీఈటీని కొనసాగించాలని, లేకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాగకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ నాయకులు భాను చరణ్, భూపతి, సాయికిరణ్, సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల విద్యా మరియు ఆర్థిక సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది

## - వై వి బి రాజేంద్ర ప్రసాద్



ఉయ్యూరు,ఆగస్టు 20,(అనంత సూర్య ప్రతినిధి): పట్టణ ముస్లింలు నాయకులు మాజీ ఎమ్మెల్సీ వై వి బి రాజేంద్ర ప్రసాద్ ని మర్యాద పూర్వకంగా కలుసుకుని మైనార్టీ ముస్లిం ప్రజల వివిధ సమస్యల పైన మెమరాండం సమర్పించినారు. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి కృషి చేస్తుందని ఇమామ్ మౌజన్ లకు గౌరవ వేతనం ఇస్తుందని,మైనారిటీల విద్యా ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు.ముస్లిం నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన వివిధ సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినారు.అదే విధం గా ఉయ్యూరులోని ముస్లిం సోదరసోదరిమణులందరూ తనను వారి కుటుంబ సభ్యుడిగా భావిస్తారని వారు తన పట్ల ప్రేమ ఆప్యాయతలతో ఉంటారని గతంలో తను ఉయ్యూరు సర్పంచ్ గా ఉన్నప్పుడు మొట్టమొదటి సిమెంట్ రోడ్డు ముస్లింలు ఎక్కువగా నివసించే ఉర్దూ స్కూల్ బజారు లో వేయడమైనదని, అదేవిధంగా వారికి ఎప్పుడు ఏ అవసరమైన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.రాజేంద్ర ప్రసాద్ ని కలుసుకున్న వారిలో మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా, మైనార్టీ సెల్ ముస్లిం నాయకులు ఐడియా ఆసిఫ్, షేక్ ఇస్మాయిల్, ఆరీఫ్, ఐడియా నూరు,ఎష్ట ప్రవీణ్, ఏసుపాదం, కిరణ్ తదితరులు ఉన్నారు..

# రమాదేవికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం అవకాశం కల్పించినందుకు వడ్డెర్లు సీఎం చంద్రబాబుకు అభినందనలు



జగ్గయ్యపేట, ఆగస్టు 20, (అనంత సూర్య ప్రతినిధి): ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు, గ్రామంలోని వడ్డే ఓబన్న విగ్రహం వద్ద వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్లూరి పార్వతి,ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సోదరుడు,యువ నాయకుడు శ్రీరామ్ చిన్నబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చంద్రబాబు ఫోటోకు.పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా శ్రీరామ్ చిన్నబాబు మాట్లాడుతూ,వడ్డెర్లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్ననిర్ణయాన్నిఅభినందించారు. దాలవాయి రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల వడ్డెర వర్గం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు, జగ్గయ్యపేటతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వడ్డెర కుల పెద్దలు,నాయకులు,మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయానికి మద్దతుగా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.వడ్డెర వర్గానికి ఎమ్మెల్సీ పదవి దక్కడం తమకు గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

# శంకర్‌పల్లిలో ఘనంగా సంకేపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మణ్ జన్మదిన వేడుకలు



చేవెళ్ల,ఆగస్టు 20,(అనంత సూర్య ప్రతినిధి): సంకేపల్లి మాజీ సర్పంచ్ ఎంకేపల్లి లక్ష్మణ్ జన్మదిన వేడుకలు శంకర్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై ఎంకేపల్లి లక్ష్మణ్‌కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి, స్వయంగా కేక్ తినిపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.ఎంకేపల్లి లక్ష్మణ్ ఎంతోకాలంగా ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారు.గ్రామ అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నాను. లక్ష్మణ్‌కు ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుంది.ఆయనఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్‌రెడ్డి,మున్సిపల్ అధ్యక్షులు చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంకేపల్లి లక్ష్మణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మణ్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

# కొత్తగూడెం యాదవ్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్తగూడెం ఆగస్టు వెలుగునాడు ప్రతినిధి): అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణ యాదవ్ కమిటీ సమావేశం గురువారం బాబు క్యాంపులోని జీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా యాదవ పెద్దలు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టణ యాదవ పెద్దల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం తెలంగాణ నాగ సీతారాములు యాదవ్ చేతుల మీదుగా నూతన కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించారు. టౌన్ అధ్యక్షుడిగా చిలక రవి యాదవ్, ఉపాధ్యక్షులుగా అమడగని జయప్రకాశ్,బొబ్బల వెంకట్,రేఖ రాజశేఖర్,ప్రధాన కార్యదర్శిగా కసరబోయిన రమేష్,కార్యదర్శిగా బుద్ధి మధు యాదవ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా పలువురు యాదవ సంఘం నాయకులు అభినందించారు.యాదవుల ఐక్యత, సంక్షేమం,అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్‌తో పాటు పట్టణ యాదవ పెద్దలు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# భాష్యం పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన




అనంతపురం, ఆగస్టు 20 అనంత సూర్య : అనంతపురం నగరం హౌసింగ్ బోర్డు నందు గల భాష్యం పాఠశాలలో ఈగల్ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, మంచి స్నేహితులను ఎంచుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపుతాయని వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు సంబంధించిన సమస్యను ఎదుర్కొంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972 నెంబర్ కు కాల్ చేసి తమకు తెలియజేయాలని, లేదా నమ్మకమైన పెద్దలు, తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. భాష్యం పాఠశాలలో ఈగల్ టీం సభ్యులను నియమించడం చాలా సంతోషంగా ఉందని ఆయన భాష్యం స్కూల్ యాజమాన్యం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు మారకద్రవ్యాలు గంజాయి పొగాకు మాత్రమే వ్యసనాలు కాదని దురలవాట్లు చరవాణిని ఉపయోగించడం దుర్భాషలాడడం మైనర్ విద్యార్థులు ధూమపానం చేయడం వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం ఇవన్నీ కూడా వ్యసనాలు గానే భావించవచ్చని ప్రస్తుత పరిస్థితుల్లో క్రమశిక్షణతో వినయ విధేయతలతో విద్య నేర్చుకోవాలని ఈ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులుగా సమాజంలో అవగాహన కల్పించాలని వారికి సూచించారు. డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు స్వాగతం పలకండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్, అనంతపురం జిల్లా జెడ్ఈఓ రవివర్మ, హెచ్ఎం, ఈగల్ టీం సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# కిడ్నీ మార్పిడి సర్జరీలో ఒక విప్లవం




అనంతపురం, ఆగస్టు 20 అనంత సూర్య : కిడ్నీ మార్పిడి సర్జరీలో ఒక విప్లవం – బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకున్నా కిడ్నీ మార్పిడి ఇక సాధ్యం అని యశోద హాస్పిటల్స్ సీనియర్ గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ పి.ఎస్ వలి, ఎండీ, డీఎం గురువారం మాసినేని గ్రాండ్ లో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లడ్ గ్రూప్ సరిపోలని కుటుంబ దాత ని వదులుకోవాల్సిన అవసరం ఇక తప్పనిసరిగా లేదన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌కి సిద్ధమయ్యే చాలా కుటుంబాల్లో ఒక సాధారణ సమస్య వస్తుంది. డోనర్ సిద్ధంగా ఉంటారు. కానీ దాత, రోగి రక్త గ్రూపులు కాకపోయినా సరిపోతాయి అన్నారు. ఏబిఓ అనుకూలమైన మూత్రపిండ మార్పిడి అంటే అధునాతన చికిత్స ద్వారా, సరైన రోగుల్లో రక్త గ్రూపు మ్యాచ్ కాకపోయినా మార్పిడి చేసే అవకాశం ఉందన్నారు. మార్పిడి ముందు శరీరంలో ఉన్న హానికరమైన యాంటీబాడీస్ ని తగ్గించి, ప్రత్యేకమైన మందులు, దగ్గరి పర్యవేక్షణతో ఈ మార్పిడిని ప్లాన్ చేస్తామన్నారు. అంటే భార్య భర్తకు, తల్లి కుమారుడికి, లేదా మరో కుటుంబ సభ్యుడు రక్త గ్రూప్ మ్యాచ్ కాకపోయినా, వెంటనే దాతని తిరస్కరించాల్సిన అవసరం లేదన్నారు. ముందుగా పూర్తి మార్పిడి మూల్యాంకనం చేయించుకోవాలి. యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లో ఇలాంటి సంక్లిష్ట మూత్రపిండ మార్పిడితో పాటు, తిరిగి మార్పిడి చేయడం, మార్పిడి తర్వాత కష్టమైన సమస్యలు కూడా మూల్యాంకనం చేసి నిర్వహించే సౌకర్యాలు ఉన్నాయి. అదేవిధంగా అధునాతన హెమోడయాలసిస్, హెచ్‌డిఎఫ్, పెరిటోనియల్ డయాలసిస్, ఐసియు రోగులకు సిఆర్ఆర్‌టి, తీవ్రమైన ఎకెఐ, సెప్సిస్, షాక్ లాంటి క్లిష్టమైన కిడ్నీ సమస్యలు కూడా సమగ్ర సంరక్షణ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాలేదని ట్రాన్స్‌ప్లాంట్ అవకాశం లేదని ముందే నిర్ణయించుకోవద్దు. సరైన సెంటర్‌లో మూల్యాంకనం చేస్తే, ఇప్పుడు మరిన్ని చికిత్స ఎంపికలు అందుబాటులో ఉన్నాయి అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేనేజర్లు సుదర్శన్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బెస్తలకు సముచిత స్థానం కల్పించండి




అనంతపురం, ఆగస్టు 20 అనంత సూర్య : స్థానిక సంస్థలు ఎన్నికలలో అనంతపురం పార్లమెంట్ పరిధిలో బెస్తలు జనాభా ఎక్కువగా ఉన్న డివిజన్లలో కార్పొరేటర్లుగా, జెడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా, సర్పంచులుగా అవకాశాలు కల్పించాలని, అదేవిధంగా శ్రీవేద వ్యాస మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చూడాలని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ కోరారు. శుక్రవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. పార్లమెంట్ పరిధిలో అర్హులైన బెస్తలకు నివాస స్థలాలు కల్పించి ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించాలన్నారు. చెరువులు, కుంటలలో బెస్త కుల వృత్తి అయిన చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంపీని శాలువాతో సత్కరించారు. ఇటీవల నూతన జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులుగా జశ్వంత్ వ్యాస్, ప్రధాన కార్యదర్శి శివ శంకర్‌లు ఎంపికైనందుకు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్త పవన్ కుమార్, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి నారాయణమూర్తి, మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా ఇంచార్జి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త వెంకటేష్, బెస్త సత్యం, జిల్లా ప్రచార కార్యదర్శి రామశేషు, నగర అధ్యక్షులు బెస్త అశోక్, బెస్త విజయకుమార్, దుర్గా ప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించే దిశగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, ఆగస్టు 20 అనంత సూర్య : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో క్రీడల్ని, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడలో ఆయన శాప్ ఛైర్మన్ రవినాయుడుని, శాప్ ఎండీ భరణిని కలిశారు. నియోజకవర్గంలోని యువత, క్రీడాకారుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారికి మెరుగైన క్రీడా మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఖేలో ఇండియా' పథకం కింద అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిపాదిత మల్టీపర్పస్ హాల్, స్క్వాష్ కోర్టు ద్వారా స్థానిక యువత, క్రీడాకారులు నిత్య శిక్షణ పొందడంతో పాటు వివిధ స్థాయి పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను మరింతగా మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందన్నారు. అదేవిధంగా యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని, క్రమశిక్షణను, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఈ సదుపాయాలు ఎంతో దోహదపడతాయన్నారు. అర్బన్ నియోజకవర్గంలో అనువైన స్థలాన్ని గుర్తించి మల్టీపర్పస్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనను సిద్ధం చేసి.. ఖేలో ఇండియా పథకం కింద అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. వీటిని నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై శాప్ ఛైర్మన్ రవినాయుడు సానుకూలంగా స్పందించారు. మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



రాప్తాడు: ధర్మవరం డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మల్లికార్జున రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాప్తాడు మండలం రామినేపల్లి వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కూటమి నేతలకు పాలాభిషేకం



పెనుకొండ, ఆగస్టు 20:( అనంత సూర్య) : గోరంట్లలోని టిడిపి పార్టీ కార్యాలయంలో కూటమి నేతలు చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మంత్రులు లోకేష్ సవిత చిత్రపటాలకు పాలాభిషేకం మండల నేతలు చేపట్టారు. ఇటీవల శాసనసభ సమావేశాలలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా బీసీ బిడ్డలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువగళం అధినేత నారా లోకేష్ కు రాష్ట్ర బీసీ బిడ్డలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం లో మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి బీసీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహనా కల్పించండి..
## దుష్ట శక్తులుపై ఉక్కుపాదం మోపండి – సీఐ రాఘవన్




పెనుకొండ, ఆగస్టు 20:(అనంత సూర్య) : సమాజం లో పోలీసుల పాత్ర వెల కట్టలేనిది అని, ప్రతి ఆడపిల్ల బాగుండేలా చూడడమే పోలీస్ లక్ష్యం అన్నారు పెనుకొండ సీఐ రాఘవన్. సోమందేపల్లి పోలీస్ స్టేషన్ ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యస్ ఐ సుధాకర్ యాదవ్ కి పలు సూచనలు చేసారు. విద్యార్థులు, ఆడపిల్లల కోసం వచ్చిన చట్టాలను వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. సమాజ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు సంఘ విద్రోహులపై ఉక్కు పాదం మోపాలి అన్నారు. నిత్యం పోలీస్ స్టేషన్కు పలు సమస్యలపై వచ్చే ప్రజలకు తగు రీతిలో న్యాయం జరిగేల చూడాలన్నారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన




పెనుకొండ, ఆగస్టు 20:( అనంత సూర్య) : మండల కేంద్రంలోని శిరిడి సాయి దేవాలయ ప్రాంగణంలో గురువారం నుండి మరో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. శంకర నేత్రాలయ మీసు పుట్టపర్తి కి చెందిన రమేష్ మాతురు, వారి సతీమణి సుజాత మాతురు సహకారంతో, స్వర్గీయ శ్రీ లాలసింగ్ రామా నాయక్ జ్ఞాపకార్థం సోమందేపల్లి మండలంలో ఉచిత కంటి పరీక్ష, చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి చూపు పరీక్షలు, కంటి సంబంధిత సమస్యల కు అవసరమైన వైద్య సేవలు సలహాలు అందించారు. అవసరమైన వారికి కంటి వైద్య పరీక్షల అనంతరం తదుపరి చికిత్సకు సంబంధించిన విషయాలు వారికి అందజేయబడతాయి. కంటి ఆపరేషన్ల అవసరం ఉన్న వారికి ప్రత్యేక వాహన సదుపాయం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి 24-08-2026 నుండి 28-08-2026 వరకు అవసరమైన సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారిలో లాల్ సింగ్ బాపుజీనాయక్ ఓఎన్జిసి, లాల్ సింగ్ రాంప్రసాద్ నాయక్ సివిల్ ఇంజనీర్ ఇరిగేషన్ శాఖ, లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ ప్రిన్సిపల్ సెషన్స్ అండ్ డిస్ట్రిక్ట్ జడ్జి వికారాబాద్ జిల్లా, శంకర నేత్రాలయ కంటి వైద్య నిపుణులు చెన్నై వారు ఉన్నారు.

# తాను తనువు చాలిస్తూ నేత్రదానం చేసిన మునీశ్వరమ్మ



నార్పల : ఆగస్టు 20 (అనంత సూర్య) : మండల కేంద్రమైన నార్పలకు చెందిన హోటల్ లక్ష్మీ రెడ్డి భార్య మునీశ్వరమ్మ (65) గురువారం తెల్లవారుజామున అనారోగ్య కారణాలతో మృతి చెందారు. భార్యను కోల్పోయిన తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ, మరొకరి జీవితంలో వెలుగులు నింపాలనే ఉదాత్త సంకల్పంతో భర్త లక్ష్మీ రెడ్డి, కుమారుడు, కుమార్తెలు కలిసి మునీశ్వరమ్మ నేత్రాలను దానం చేశారు. మునీశ్వరమ్మ నేత్రదానం ద్వారా చూపును కోల్పోయిన ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం లభించనుంది. కుటుంబ సభ్యుల ఈ మానవతా నిర్ణయాన్ని స్థానికులు అభినందిస్తూ ప్రశంసించారు. నేత్రదానం, అవయవదానాల పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని, ఇలాంటి దాతృత్వ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పలువురు ఆకాంక్షించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405